
మీ సేవ కేంద్రంలో దరఖాస్తుదారులు

మీ సేవ కేంద్రాలకు రేషన్‌కార్డు ఆశావహుల క్యూ

బంజారాహిల్స్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించిన గంటకే వెబ్‌సైట్ పనిచేయకపోవడంతో దరఖాస్తుదారులు ఉసూరుమన్నారు. సోమవారం సాయంత్రం నుంచి వెబ్‌సైట్ పనిచేయకపోవడంతో మంగళవారం ఉదయం నుంచి మీ సేవ కేంద్రాలు కిటకిటలాడాయి. ఎండను సైతం పట్టించుకోకుండా దరఖాస్తుదారులు క్యూలైన్‌లో బారులు తీరారు. వైబ్‌సైట్ మరోసారి పనిచేయకపోతే ఇబ్బంది పడాల్సి వస్తుందనే ఆలోచనతో అనేక మంది పనులు మానుకొని మీ సేవ కేంద్రాలకు పరుగులుతీశారు. దీంతో బంజారాహిల్స్, ఎస్‌ఆర్‌నగర్ పరిధిలో మీ సేవ కేంద్రాల వద్ద జనం భారీగా కనిపించారు. సరైన డాక్యుమెంట్లు లేకపోవడంతో కొందరు వెనుదిరిగారు. ఈ సేవ కేంద్రాలకు జనం పెద్ద ఎత్తున వస్తుండటంతో దరఖాస్తుదారుల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. బంజారాహిల్స్ ఈ సేవ కేంద్రంలో నాలుగు కేంద్రాల్లో సేవలందించారు. ఎస్‌ఆర్‌నగర్‌లో ఐదు కేంద్రాల ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. ఎలాంటి డాక్యుమెంట్లు కావాలనేది నోటీసు బోర్డులో సూచనలు పెట్టారు. ఆధార్ కార్డు, కరెంట్ బిల్లు తప్పనిసరిగా కావాలని సిబ్బంది దరఖాస్తుదారులకు చెప్పారు.

ప్రజాపాలన కేంద్రంలో రేషన్‌కార్డు దరఖాస్తు ఫారాలు

బోరబండ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందించే రేషన్‌కార్డుల దరఖాస్తు ఫారాలను డివిజన్ పరిధిలోని ప్రజా పాలన సేవా కేంద్రంలో అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా మంగళవారం ప్రజా పాలన కేంద్రంలో నగర కాంగ్రెస్ నాయకురాలు హబీబాసుల్తానా ప్రజలకు దరఖాస్తులను అందజేశారు అందజేశారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఆమె సూచించారు.


రేషన్‌కార్డు ఫారాలు అందజేస్తున్న హబీబాసుల్తానా


ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న చిన్నారెడ్డి

ప్రజావాణికి 2,480 అర్జీలు

బేగంపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణికి 2480 అర్జీలు వచ్చాయి. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు, ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్య ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి వారి సమస్యలు తెలుసుకున్నారు. సాధ్యమైనంత వరకు అర్జీలను త్వరగా పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వారు వెల్లడించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి 139, విద్యుత్ శాఖకు 110, రెవెన్యూకు 36, ఇందిరమ్మ ఇళ్ల కోసం 2130, ఇరత శాఖలకు 64, ప్రవాసీ ప్రజావాణికి 1 చొప్పున దరఖాస్తులు వచ్చినట్లు ప్రజావాణి అధికారులు తెలిపారు.


దీన్‌దయాళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్‌కు నివాళి

అమీర్‌పేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బీజేపీకి పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ చేసిన సేవలు మరువలేనివని బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్ అన్నారు. దీన్‌దయాళ్ వర్ధంతి సందర్భంగా మంగళవారం సత్యం టాకీస్ చౌరస్తాలో మాజీ అధ్యక్షుడు శ్యామ్‌సుందర్ గౌడ్, కార్పొరేటర్ సరళ, పార్టీ శ్రేణులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వర్ రెడ్డి, శ్రీశైలం గౌడ్, డివిజన్ అధ్యక్షుడు పవన్ కుమార్, ఎం.ఎస్ విఠల్, కొత్తపల్లి రాజు, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం కేసు ఆధారాలతో మృతుడి ఆచూకీ లభ్యం

బంజారాహిల్స్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): యువకుల నిర్లక్ష్యం కారణంగా ఫుట్‌పాత్‌మీద పడుకున్న వ్యక్తి మరణించాడు. మృతుడి ఆచూకీ కోసం పోలీసులు పదిహేను రోజుల పాటు శ్రమించి చివరకు వేలి ముద్రల ద్వారా మృతుడిని గుర్తించారు. జనవరి 25న ఓ వ్యక్తి బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ఎదుట ఫుట్‌పాత్ మీద పడుకున్నాడు. అర్ధరాత్రి తరువాత మద్యం మత్తులో ఇద్దరు కారు నడుపుతూ ఫుట్‌పాత్‌ను ఢీ కొట్టి అక్కడ పుడుకున్న గుర్తుతెలియని వ్యక్తి మీదకు ఎక్కడంతో మరణించాడు. గాంధీ మార్చురీలో మృతదేహాన్ని భద్రపర్చిన బంజారాహిల్స్ పోలీసులు మృతుడి చేతి ముద్రలను తీసుకొని పోలీసు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. 2015లో కుషాయిగూడ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఓ చోరీ కేసులో మృతుడి వేలిముద్రలు సరిపోలాయి. వాటి ఆధారంగా పోలీసులు కర్నూల్ జిల్లా కోటపాడు గ్రామానికి చెందిన రాగిపోగుల నవతేజగా గుర్తించారు. అయితే పోలీసులు అక్కడకు వెళ్లగా నవతేజ కుటుంబ సభ్యులు ఎవరూ లేరు. గ్రామ పెద్దల ద్వారా నగరంలో ఉంటున్న నవతేజ సోదరుడిఆచూకీ తెలుసుకొని మృతదేహాన్ని అప్పగించారు.

మద్యం మత్తులో యువకుడి మృతి

బోరబండ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి):మద్యం మత్తులో యువకుడు మృతిచెందిన ఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖబీర్‌నగర్‌కు చెందిన ఎస్.వినోద్(30) దినసరి కార్మికుడు. మంగళవారం బోరబండలోని ఓ వైన్స్ షాపు ముందు ఓ యువకుడు పడిపోయాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి వినోద్‌ను పరిశీలించగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించామని పోలీసులు తెలిపారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

అమీర్‌పేట, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి): కోర్టు ఉత్తర్వుల మేరకు ఎస్‌ఆర్‌నగర్ ఈడబ్ల్యూఎస్ క్వార్టర్లలో జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాలను మంగళవారం కూల్చివేశారు. ఈడబ్ల్యూఎస్ క్వార్టర్ నంబర్ 41లో యజమాని రామకృష్ణ జీహెచ్‌ఎంసీ ద్వారా గ్రౌండ్ ప్లస్ టూ ఫ్లోర్లకు అనుమతులు పొంది, అదనంగా మూడవ అంతస్తుతో పాటు పెంట్ హౌస్ నిర్మాణాలు కూడా చేపడుతుండడంతో కొందరు ఈ అక్రమ నిర్మాణాల అంశాన్ని కోర్టులో సవాల్ చేశారు. దీంతో కోర్టు అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు తమకు అందిన ఉత్తర్వుల మేరకు జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఇన్‌చార్జ్ మన్సూర్ తారిక్ తన సిబ్బందితో కలిసి అక్రమ అంతస్తులను కూల్చివేశారు.

చెస్ట్ ఆస్పత్రిలో నీటి కొరత

- తీవ్ర ఇబ్బందులు పడుతున్న రోగులు
- ఎండిపోయిన బోరు.. జలమండలి నుంచి సైతం అందని నీరు
- పట్టించుకోని అధికారులు

ఎర్రగడ్డ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలోని చెస్ట్ ఆస్పత్రిలో నీటి సమస్య కారణంగా రోగులు ఇబ్బందులు పడుతున్నారు. తాగడానికి, ఇతర అవసరాలకు సరిపడా నీరు అందడం లేదని రోగులు, వారి బంధువులు చెబుతున్నారు. తాము ఇన్ని ఇబ్బందులు పడుతున్నా ఆస్పత్రి అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి దారుణ పరిస్థితులు లేవని కొందరు చెబుతున్నారు.


ఆస్పత్రిలో నీటిని నిల్వ చేసేందుకు ఏర్పాటు చేసిన సంపు

వట్టిపోయిన బోరు

గతంలో ఆస్పత్రిలో రెండు బోర్లు ఉండగా, అందులో ఒకటి ప్రస్తుతం నిర్మాణం జరుగుతున్న టిమ్స్ (తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) పరిధిలోకి వెళ్లింది. రెండవది ధోబీ ఘాట్ వద్ద ఉంది. అయితే ఆ బోరు ప్రస్తుతం పూర్తిగా వట్టిపోవడంతో నీరు సరిగా రావడం లేదని ఆస్పత్రి సిబ్బంది పేర్కొంటున్నారు. టిమ్స్ నిర్మాణ అవసరాలకు ఆ ప్రాంతంలో నాలుగు బోర్లు వేయడం వల్ల చెస్ట్ ఆస్పత్రిలో ఉన్న బోరు పూర్తిగా ఎండిపోయిందని.. దీంతో నీటి కొరత తలెత్తిందంటున్నారు.

మరమ్మతులకు గురైన పైపులైన్లు

గతంలో జలమండలి విభాగం నుంచి సరఫరా అయ్యే నీరు ఆస్పత్రి అవసరాలకు సరిపోయేది. అయితే ఇక్కడున్న భారీ వృక్షాల కారణంగా తాగునీటి పైపులకు వేర్లు అడ్డుపడి పూర్తిగా మూసుకుపోయినట్లు తెలుస్తోంది. అయితే పైపులకు మరమ్మతులు చేయకుండా గత ఆరు నెలలుగా అధికారులు తాత్సారం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పైపులైన్లు మూసుకుపోవడంతో నీటి సరఫరా పూర్తిగా ఆగిపోయింది. దీంతో గతంలో రోజుకు 8 ట్యాంకర్ల ద్వారా ఆస్పత్రికి నీరు వచ్చేది. వాటిని సంపులలో నిల్వ ఉంచి వార్డులకు సప్లై చేసేవారు. అయితే ప్రస్తుతం ప్రతిరోజూ 2, 3 ట్యాంకర్లు కూడా రావడం లేదని రోగులు చెబుతున్నారు. నీటి కొరత కారణంగా రోగులకు భోజనం సరఫరా చేసే కాంట్రాక్టర్ సైతం ప్రత్యేకంగా ఒక ట్యాంకర్ నీటిని తెప్పిస్తున్నట్లు సమాచారం.



ఎర్రగడ్డలోని చెస్ట్ హాస్పిటల్

అధికారులు పట్టించుకోవడం లేదు

ఆస్పత్రిలో నీటి కొరత తీవ్రంగా ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. నీటి కొరతతో నాలుగైదు రోజులకు ఒకసారి స్నానం చేయాల్సి వస్తోంది. తాగడానికి వాటర్ బాటిళ్లను కొనుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నిజామాబాద్ వాసి

సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం

టిమ్స్ ఆస్పత్రి నిర్మాణం, భారీ చెట్ల మూలంగా జలమండలి పైప్‌లైన్లు పూర్తిగా మూసుకుపోయాయి. దీంతో ఆస్పత్రికి సరిపడా నీరు అందడం లేదు. పైపులైన్లకు మరమ్మతులు చేసేందుకు జలమండలి అధికారులను సంప్రదించాం. రెండు వారాల్లో మరమ్మతులు పూర్తి చేస్తామని చెప్పారు. పనులు పూర్తయితే సరిపడా నీరు అందుతుంది.

- శ్రావణ్‌కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్

ఎస్సీ రిజర్వేషన్లను 18 శాతానికి పెంచాలి

- ఎస్సీ ఉపకులాల ఐక్య వేదిక అధ్యక్షుడు రాజలింగం

పంజాగుట్ట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ముప్పై ఏళ్ల పాటు పోరాటం చేసి ఎస్సీ వర్గీకరణను సాధించుకున్నామని తెలంగాణ ఎస్సీ 57 ఉపకులాల ఐక్య వేదిక అధ్యక్షుడు చింతల రాజలింగం అన్నారు. వర్గీకరణ చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహ, అలుపెరగని పోరాట చేసిన మంద కృష్ణమాదిగ, ఏక సభ్య కమిషన్ జస్టిస్ షమీమ్ అక్తర్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు సమావేశంలో వేదిక నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్లను 18 శాతానికి పెంచాలని కోరారు. మలమాదిగలతో ఉపకులాలమైన తాము పోటీ పడలేమని, వారి మధ్య నలిగిపోతున్నామన్నారు. ఉపకులాల జనాభాను తక్కువ చేసి చూపారని, తమ జనాభా దామాషా ప్రకారం తమకు వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. నిజమైన జనగణన చేపట్టి ఎవరి జనాభా ఎంత ఉందో తేల్చాలని ప్రభుత్వాన్ని కోరారు. కుల సర్టిఫికెట్లు సమయానికి రాకపోవడంతో ఉపకులాలకు చెందిన చాలామంది మాలమాదిగ పేరుతో సర్టిఫికెట్ తీసుకున్నారని చెప్పారు. ఎందరో ముఖ్యమంత్రులు మారినా వర్గీకరణ సాధ్యం కాలేదని, సీఎం రేవంత్ రెడ్డి వర్గీకరణ చేశారన్నారు. అత్యంత వెనుకబడిన 15 కులాలను గుర్తించి గ్రూపు 1లో పెట్టినందుకు ఆయనకు రుణపడి ఉంటామన్నారు. అత్యంత వెనుకబడిన కులాల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో వేదిక ఉపాధ్యక్షుడు ఏర్పుల యాదయ్య బైండ్ల, వేదిక నాయకులు ఎన్.శంకర్ గోసంగి, సంపత్, వి.రాములు, ఎన్.నర్సింహులు, ఎన్.రాజు, ఎస్.తిరుమల, పి.శంకర్, బి.సాలమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజలింగం

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను వర్గీకరించాలి

- వైశ్య వికాస వేదిక చైర్మన్ సత్యనారాయణ గుప్త

పంజాగుట్ట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు వైశ్య సామాజిక వర్గానికి సముచిత స్థానం కల్పించాలని, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లను వర్గీకరించాలని వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక చైర్మన్ కాచం సత్యనారాయణ గుప్త డిమాండ్ చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు సమావేశంలో వేదిక నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లలో తమ వాటా తేల్చాలని ఆయన డిమాండ్ చేశారు. రాజకీయంగా ఎదగని జాతికి ఎదుగుదల ఉండదని, తమకు సముచిత ప్రాతినిధ్యం కల్పిస్తే స్థానిక ఎన్నికల్లో తమ ప్రాబల్యం చూపిస్తామన్నారు. కేసీఆర్ చేసిన సమగ్ర కుటుంబ సర్వేలో తమ జనాభా నాలుగు శాతం ఉందని తెలిసిందని, 40 నియోజకవర్గాల్లో అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేయగల స్థితిలో తాము ఉన్నామన్నారు. కుల రాజకీయ సంస్కృతి పెరుగుతుండటంతో తాము అస్తిత్వం కోల్పోతున్నామని, తమ ఆత్మగౌరవం దెబ్బతింటోందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే త్వరలోనే ఎన్టీఆర్‌స్టేడియంలో వైశ్య రాజకీయ రణభేరి నిర్వహించి తమ సత్తా చూపుతామని హెచ్చరించారు. కంచె ఐలయ్య వ్యాఖ్యలపై చాలా సంఘాలు తమకు అండగా నిలిచాయని, వారందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నామని చెప్పారు. వేదిక ప్రధాన కార్యదర్శి రమేష్, న్యాయ సలహాదారు ఎస్.రమేష్, సలహాదారు ఈశ్వరయ్య, ప్రభుగుప్త, రామ్‌నరేష్, దయాకర్ రావు, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.


సమావేశంలో అభివాదం చేస్తున్న వైశ్య వికాస వేదిక ప్రతినిధులు

లక్డీకాపూల్‌లో మురుగు సమస్యకు పరిష్కారం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి11 (ఆంధ్రజ్యోతి): లక్డీకాపూల్‌లో రోడ్డుపై సీవరేజ్ ఓవర్ ఫ్లో సమస్యను అధికారులు పరిష్కరించారు. జెట్టింగ్ యంత్రాన్ని ఉపయోగించి సిల్ట్‌ను బయటికి తీసి మురుగు నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చేశారు. ఫలితంగా సీవరేజ్ ఓవర్ ఫ్లో సమస్య పరిష్కారమైంది. వాస్తవానికి స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఇక్కడ డీ-సిల్టింగ్ పనులు నిర్వహించి సిల్ట్ అంతా తొలగించారు. కానీ మళ్లీ అందులో వ్యర్థాలు వేయడంతో అవి పేరుకుపోయి మళ్లీ ఓవర్ ఫ్లో అయింది. ప్రజల అవగాహన లేమితో మ్యాన్‌హోళ్లలో ప్లాస్టిక్ వస్తువులు, కవర్లు, వాటర్ బాటిళ్లు, ఘన పదార్థాలు లాంటి వ్యర్థాలు వేస్తున్నారని, ఇక నుంచి ఎవరైనా మ్యాన్ హోళ్లలో చెత్త వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

ఇష్టానుసారం చెత్త వేస్తున్న ప్రజలు

నగరవాసులు కొందరు ఇష్టానుసారంగా మ్యాన్‌హోళ్లలో వ్యర్థాలు వేస్తున్నారు. సిల్ట్ పూడికతీత క్రమంలో మ్యాన్‌హోళ్ల నుంచి దిండ్లు, పరుపులు తీసిన ఘటనలూ ఉన్నాయి. వ్యర్థాలు వేయడం వల్ల మురుగు నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతుంది. హోటళ్లు, కార్యాలయాలు, బేకరీలు, ఫుడ్ కోర్టులు, వాణిజ్య భవనాల నిర్వాహకులు తమ సీవరేజ్ పైపులైన్‌ను నేరుగా జలమండలి సీవరేజ్ నెట్‌వర్క్‌కు అనుసంధానం చేయడంతో వాటి నుంచి వచ్చే ఆహార, వ్యర్థ పదార్థాలు మ్యాన్‌హోళ్లలో చేరుతున్నాయి. సిల్ట్ ఛాంబర్లు నిర్మించుకోకపోవడం వల్ల కూడా ఈ సమస్య తలెత్తుతోంది.

సిల్ట్ ఛాంబర్లు నిర్మించుకోవాలి

నగరంలోని హోటళ్లు, కార్యాలయాలు, బేకరీలు, ఫుడ్ కోర్టులు, వాణిజ్య భవనాల యజమానులు, బహుళ అంతస్తుల భవన సముదాయాల నిర్వాహకులు తప్పనిసరిగా సిల్ట్ ఛాంబర్లు నిర్మించుకునేలా నోటీసులు జారీ చేయాలని వాటర్ బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించిన వారి సీవరేజ్ పైపులైన్ కనెక్షన్లను తొలగించాలని ఎండీ అశోక్‌రెడ్డి సూచించారు.

జేఎన్‌టీయూలో భారీగా బదిలీలు

- కీలక స్థానాల్లో జగిత్యాల జేఎన్‌టీయూ ప్రొఫెసర్లు
- ఆపద్ధర్మ పదవుల్లో ముగ్గురు ఆచార్యులను కొనసాగిస్తూ ఉత్తర్వులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలో పలువురు అధికారులు, ఆచార్యులను బదిలీ చేస్తూ వర్సిటీ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ ఎం.పద్మావతిని బ్యూరో ఆఫ్ ఇండస్ట్రియల్ కన్సల్టెన్సీ సర్వీసెస్(బిక్స్) డిప్యూటీ డైరెక్టర్‌గా నియమించారు. ఆ స్థానంలో ఉన్న అసోసియేట్ ప్రొఫెసర్ శ్రీలక్ష్మిని క్యాంపస్ ఇంజనీరింగ్ కాలేజీకి బదిలీ చేశారు. జగిత్యాల జేఎన్‌టీయూ కాలేజీలో ఫిజిక్స్ ప్రొఫెసర్ విజయకుమార్‌ను సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ కాలేజీకి, అక్కడి ఫిజిక్స్ విభాగాధిపతి సురేష్‌శ్రీపాదను జగిత్యాలకు బదిలీ చేశారు. జగిత్యాలలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉన్న బేబీశాలినిని డిప్యుటేషన్‌పై సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ కాలేజీకి పంపారు.

జగిత్యాల ప్రొఫెసర్లకు రెడ్‌కార్పెట్..

జగిత్యాల జేఎన్‌టీయూ కాలేజీ నుంచి హైదరాబాద్ క్యాంపస్‌కు డిప్యుటేషన్ల వరద కొనసాగుతోంది. ఇప్పటికే జగిత్యాల కాలేజీ నుంచి సుమారు 30 మంది ప్రొఫెసర్లు హైదరాబాద్ క్యాంపస్‌లో డిప్యుటేషన్‌పై కొనసాగుతుండగా, తాజాగా అదే కాలేజీకి చెందిన మరో మెకానికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ వసంత్ కుమార్ హైదరాబాద్ కాలేజీకి డిప్యుటేషన్‌పై వచ్చారు. అయితే.. క్యాంపస్‌లో ఉన్న ప్రొఫెసర్ల కంటే జగిత్యాల నుంచి వచ్చిన ప్రొఫెసర్లకు వర్సిటీ ఉన్నతాధికారులు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. క్యాంపస్‌లో విద్యార్థులకు బోధన కోసం కాకుండా.. కీలకమైన స్థానాల్లోపోస్టింగ్‌లు/పదవుల కోసమే జగిత్యాల నుంచి ప్రొఫెసర్లు డిప్యుటేషన్‌పై వస్తుండడాన్ని విద్యార్థి సంఘాలు ఆక్షేపిస్తున్నాయి. హైదరాబాద్ క్యాంపస్ కాలేజీకి డిప్యుటేషన్‌పై వస్తున్న జగిత్యాల ప్రొఫెసర్లకు డిప్యుటేషన్ ఆర్డర్‌తో పాటు పరీక్షల విభాగంలో కంట్రోలర్‌గానో, డైరెక్టరేట్లలో డైరెక్టర్ లేదా డిప్యూటీ డైరెక్టర్‌గానో నేరుగా పోస్టింగ్‌లు ఇస్తుండడంపై యూనివర్సిటీ వర్గాల నుంచి సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం పరీక్షల విభాగంలో ఏడుగురు అదనపు కంట్రోలర్లు ఉండగా, ఐదుగురు జగిత్యాల కాలేజీ నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన ప్రొఫెసర్లే కావడం గమనార్హం.

ఆపద్ధర్మ పదవుల్లో ఆచార్యులు..

యూనివర్సిటీలో కీలకమైన పదవుల్లో ఉన్న ఆచార్యుల పదవీకాలం ముగిసినప్పటికీ.. వారిని ఆయా పదవుల్లోనే ఆపద్ధర్మంగా కొనసాగిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేయడం యూనివర్సిటీ ఉద్యోగులను, అధికారులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ పదవీకాలం ఈనెల 7తో ముగియగా, తదుపరి అరేంజ్‌మెంట్ చేసే వరకు కొనసాగాలని తాజాగా జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు తెలిసింది. మాజీ వైస్‌చాన్స్‌లర్ హయాంలో ఏడాది కాలానికి నియమితులైన పరీక్షల విభాగం డైరెక్టర్, అకాడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ విషయంలోనూ యూనివర్సిటీ ఉన్నతాధికారులు ఇదే తరహా ఉత్తర్వులు జారీ చేశారని తెలిసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా వర్సిటీ ఉన్నతాధికారులు ఆపద్ధర్మంగా వ్యవహరించడం డైరెక్టర్లలోనూ, కిందిస్థాయి సిబ్బందిలోనూ సందేహాలకు కారణమవుతోంది. సదరు అధికారుల సేవలు వర్సిటీకి అవసరమని భావిస్తే మరో ఏడాది పొడిగించాల్సింది పోయి.. అయోమయంగా ఉత్తర్వులు జారీ చేయడం సమంజసంగా లేదని సిబ్బంది వాపోతున్నారు.


చిన్నారికి భోజనం తినిపిస్తున్న మంత్రి సీతక్క

చిన్నారుల్లో సేవాభావం పెంపొందించాలి

బంజారాహిల్స్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ సంపాదనలో కొంత సమాజ శ్రేయస్సు కోసం వినియోగించాలని మంత్రి సీతక్క సూచించారు. చిన్నప్పుడే పిల్లల్లోసేవా భావం పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. జూబ్లీహిల్స్‌లోని ఏఎస్ఎఫ్ బీబీక్యూ గ్రిల్ రెస్టారెంట్‌లో అనాథ పిల్లలకు భోజనం వడ్డించేందుకు మంగళవారం వన్ ఈవెనింగ్ ఆఫ్ టుగెదర్ అండ్ జాయ్ పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి చిన్నారులతో కాసేపు సరదాగా గడిపారు. వారితో కలిసి భోజనం చేశారు. సంస్థ నిర్వాహకుడు ఆరిఫ్ ఆలీ మాట్లాడుతూ.. సామాజిక బాధ్యతగా చిన్నారులకు రుచికరమైన ఆహారం అందించినట్లు తెలిపారు. 70 మంది చిన్నారులు హాజరయ్యారు.

నేడు సనత్‌నగర్‌లో ఉద్యోగ మేళా

అమీర్‌పేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం సనత్‌నగర్‌లోని డాన్ బాస్కో, దిశ బీఎస్‌కే సంస్థల ఆధ్వర్యంలో నేడు ఉచిత ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. సనత్‌నగర్‌లోని సెయింట్ థెరిస్సా చర్చి ఆవరణలో నిర్వహించే మేళాకు పది, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన వారు హాజరుకావొచ్చని దిశ సంస్థ డైరెక్టర్ ఫాదర్ జస్టిన్, సమన్వయకర్త ఐవాన్ వాజ్, మేళా పర్యవేక్షకులు కార్తీక్, శరత్ మంగళవారం వెల్లడించారు. మేళాలో టెక్ మహీంద్రా, మెడ్‌ప్లస్, ఎంపవర్‌మెంట్ సర్వీస్, అపోలో తదితర 15 సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారని.. వివరాలకు 98482 73301, 83101 33469 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఎయిర్‌పోర్ట్‌కు పుష్పక్ బస్సులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జేబీఎస్, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి రాజీవ్‌గాంధీ ఎయిర్‌పోర్ట్‌కు మొదటిసారిగా 6 పుష్పక్ బస్సులను బుధవారం ప్రారంభిస్తున్నట్లు గ్రేటర్ ఆర్టీసీ ఇన్‌చార్జి ఈడీ రాజశేఖర్ తెలిపారు. శంషాబాద్‌లోని విమానశ్రయానికి వెళ్లే ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలందించే లక్ష్యంతో పుష్పక్ ఏసీ సర్వీసులను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. జేబీఎస్ నుంచి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, రాణిగంజ్, సచివాలయం, రవీంద్రభారతి, హజ్ హౌస్, నాంపల్లి, గాంధీభవన్, ఎంజే మార్కెట్, అఫ్జల్‌గంజ్, బహదూర్‌పురా, ఆరంఘర్, శంషాబాద్‌కు మొదటి బస్సు అర్ధరాత్రి 12.55 నుంచి చివరి బస్సు రాత్రి 11.55 వరకు నడుపుతున్నట్లు తెలిపారు. రాజీవ్‌గాంధీ ఎయిర్‌పోర్ట్ నుంచి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు అర్ధరాత్రి 12.50 నుంచి రాత్రి 11.50 వరకు బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు.

బస్సులు బయల్దేరే సమయం

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి ఎయిర్‌పోర్ట్‌కు..

0:55, 3:15, 4:15, 5:15, 6:15, 7:55, 8:55, 9:55, 10:45, 11:45, 12:45, 13:45, 14: 25, 15:25, 16:25, 17:25, 18:15, 19:15, 20:15, 21:15, 21:55, 22:55, 23:55 సమయం వరకు.

ఎయిర్ పోర్ట్ నుంచి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు.. 0:50, 1:50, 2:50, 5:10, 6:10, 7:10, 8:10, 8:50, 9:50, 10:50, 11:50, 12:40, 1:40, 14:40, 15:40, 16:20, 17:20, 18:20, 19:20, 20:10, 21:10, 22:10, 23:10, 23:50 వరకు.


మాట్లాడుతున్న రవీంద్ర చారి

అర్చకులపై దాడులు చేయడం దారుణం

- అర్చక ఉద్యోగ జేఏసీ

అమీర్‌పేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): చిలుకూరి బాలజీ దేవాలయం ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై జరిగిన దాడిని అర్చక ఉద్యోగ జేఏసీ తీవ్రంగా ఖండించింది. మంగళవారం తుల్జా భవన్ ధర్మశాలలో నిర్వహించిన సమావేశంలో అర్చక ఉద్యోగ జేఏసీ కన్వీనర్ పరశరం రవీంద్ర చారి మాట్లాడారు. హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేస్తున్న అర్చకులపై దాడి చేయడం దారుణమన్నారు. ఈ సమావేశంలో ఉద్యోగ సంఘం అధ్యక్షులు తాండూరి కృష్ణమాచార్యులు, గ్రేటర్ హైదరాబాద్ ఉద్యోగ సంఘం అధ్యక్షులు జగపతి, జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ, అధ్యక్షులు బద్రీనాథ్ చారి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత తెలంగాణను నిర్మిద్దాం

పంజాగుట్ట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): విదేశీ శక్తులు పథకం ప్రకారం యువతను మాదకద్రవ్యాలకు బానిసలుగా చేస్తూ వారిని నిర్వీర్యం చేస్తున్నాయని వక్తలు అన్నారు. జన వికాస సేవా సమితి విభాగం వికాస భారతి ఆధ్వర్యంలో మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమాజాన్ని భ్రష్టు పట్టిస్తున్న మాదకద్రవ్యాలపై సదస్సు జరిగింది. వికాస భారతి అధ్యక్షుడు డాక్టర్ పాండు రంగారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచందర్ రావు, ఎఫ్.జి.జి అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎం.వి. రెడ్డి, బీజేపీ క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ చింతా సాంబమూర్తి, డాక్టర్ దేవేందర్ సింగ్, డి.రాము, వికాస భారతి డైరెక్టర్లు టి.శ్రీనివాస్, వి.ఎస్.రెడ్డి తదితరులు పాల్గొని మాట్లాడారు. ఇటీవలి కాలంలో మాదకద్రవ్యాలు ఎక్కడ పడితే అక్కడ దొరుకుతున్నాయని, వీటిని నిరోధించాల్సిన అవసరం ఉందన్నారు. అందరం కలిసికట్టుగా డ్రగ్స్ రహిత తెలంగాణను నిర్మిద్దామని వారు పిలుపునిచ్చారు.



మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్‌ను మంగళవారం మర్యాదపూర్వ కంగా కలిసిన రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా. - (సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి)



బాక్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్

స్టేట్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం

తార్నాక, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బాక్సింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 8వ ఎలైట్ ఉమెన్స్ స్టేట్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ 2025 పోటీలు మంగళవారం లాలాపేట్‌లోని ప్రొ. జయశంకర్ స్టేడియంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బాక్సింగ్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. బాక్సింగ్ వంటి క్రీడలలో మహిళలు రాణించడం ఎంతో గర్వకారణంగా ఉందని, భవిష్యత్‌లో అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశానికి కీర్తి ప్రతిష్ఠలను తీసుకురావాలని కోరారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

ఘనంగా చర్చి వార్షికోత్సవం

తిరుమలగిరి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి సెంట్రల్ బస్తీలోని ఔర్ లేడీ ఆఫ్ లార్డ్స్ చర్చ్ 125వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్య అతిథిగా హాజరై దీవెనలు పొందారు. అనంతరం వార్షికోత్సవానికి విచ్చేసిన భక్తులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం పూర్వం నుంచి ఇక్కడ ప్రార్థనలు జరగడం ఈ చర్చ్ ప్రాశస్త్యాన్ని తెలియజేస్తుందని, దైవానుగ్రహం, ప్రజల ఆశీస్సులతో ఎమ్మెల్యేగా గెలుపొందానన్నారు. ప్రజల మన్నలు పొందేలా ప్రజాసేవ చేస్తానని, నిత్యం ప్రజలలో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు రేమండ్ హార్‌ఉడ్, నాగేని సరిత, మురళి ముదిరాజ్, మైఖేల్ అబ్రహం, నరేష్, రాకేష్, బస్తీ వాసులు ఉన్నారు.



ధ్వజారోహణం కార్యక్రమాన్ని వీక్షిస్తున్న భక్తులు

వెంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

బోయిన్‌పల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బోయిన్‌పల్లి న్యూసిటీ కాలనీలోని వెంకటేశ్వరస్వామి దేవాలయ 23వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయ ప్రధాన రహదారులలో స్వాగత తోరణాలను ఏర్పాటు చేశారు. బుధవారం బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రత్యేక పూజలు, మహా ప్రసాదం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు. ఈ నెల 15 వరకు వేడుకలు కొనసాగనున్నాయి.



వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే శ్రీగణేష్

రైతుబజార్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే

తిరుమలగిరి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): శామీర్‌పేట్ ఎలివేటెడ్ కారిడార్‌లో భగంగా చేపట్టనున్న భూసేకరణలో భూములు కోల్పోతున్న అల్వాల్ రైతు బజార్ వ్యాపారులు ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను రెండు రోజుల క్రితం కలిసి తమ గోడు వినిపించారు. స్పందించిన ఎమ్మెల్యే మంగళవారం మార్కెట్‌లో పర్యటించారు. అధికారులు, రైతులు, వ్యాపారులు, స్థానిక నాయకులతో కలిసి రైతు బజార్‌ను పరిశీలించారు. వారితో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో పాటు అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లి పరిష్కరిస్తానని, ఇక్కడ కోల్పోతున్న భూమికి బదులుగా అందరికీ అనువైన చోట భూమిని తీసుకొని రైతుబజార్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు వేణుగోపాల్ రెడ్డి, నరసింహన్, అరవింద్, బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామన్, శ్రీను తదితరులు ఉన్నారు.

నాగార్జున నగర్ కాలనీ పార్కు అభివృద్ధికి కృషి

- డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్ రెడ్డి

తార్నాక, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తార్నాకలోని నాగార్జున నగర్ కాలనీ పార్కు అభివృద్ధికి కృషి చేస్తానని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్సీ కోదండరాంతో కలిసి నాగార్జున నగర్ కాలనీ పార్కును సందర్శించిన ఆమె పార్కులో మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల మానసిక, శారీరక ఉల్లాసానికి పార్కులు ఎంతగానో దోహదపడుతాయన్నారు. పార్కులో సీనియర్ సిటిజన్ల కోసం మరుగుదొడ్లతో పాటు, మౌలిక సదుపాయాలను కల్పిస్తానని తెలిపారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవి కిరణ్, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెల్లవారుజామునే విద్యార్థుల ఇళ్లకు..

- వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా చర్యలు
- అడ్డగుట్ట ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల కృషి
- చదువుకుంటున్న తీరుపై పరిశీలన



తెల్లవారుజామున విద్యార్థి ఇంటికి వెళ్లి అతడి తల్లితో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

అడ్డగుట్ట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు అడ్డగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున ఐదు గంటలకు విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులు వెళ్లి వారు చదువుకుంటున్న తీరును పరిశీలించారు. పాఠశాల ప్రిన్సిపాల్ మదన్‌మోహన్‌రెడ్డితో పాటు ఉపాధ్యాయులు జగన్నాథం, వేణుగోపాల్, మార్టిక్ విద్యార్థులకు ఇళ్లకు వెళ్లారు. ఉపాధ్యాయులు ఇంటి తలుపు తట్టగానే విద్యార్థితో పాటు తల్లిదండ్రులు బయటికి రావడం, చదువుకుంటున్నామని విద్యార్థులు చెప్పడంతో టీచర్లు ఆనందం వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థి బాగా చదువుకోవాలని పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని వారికి ఉపాధ్యాయులు సూచించారు. వచ్చే నెల 23 నుంచి పదవ తరగతి పరీక్షలు ఉండడంతో అడ్డగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల్ల టీచర్లు విద్యార్థులపై పూర్తిగా దృష్టి సారించారు. ఈ పాఠశాలలో 73 మంది పదో తరగతి చదువుతున్నారు. 2023-24లో 72 శాతం ఉత్తీర్ణత సాధించగా.. ఈ సారి 100 శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు.

విద్యార్థుల్లో మంచి ప్రతిభ ఉంది



తమ స్కూల్‌లో చదువుతున్న పదో తరగతి విద్యార్థుల్లో మంచి టాలెంట్ ఉంది. తెల్లవారుజామున నేరుగా విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారు చదువుకుంటున్న తీరును పరిశీలిస్తున్నాం. రాష్ట్రంలో మొదటిసారిగా ఈ ప్రయత్నం చేశాం. విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఇవ్వాలన్నదే మా ఆలోచన.

- మధన్‌మోహన్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్

రోజూ తెల్లవారుజామున ఫోన్ చేస్తా



మా పాఠశాలలో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థినులకు తెల్లవారుజామున ఐదు గంటలకు ఫోన్ చేసి నిద్రలేపుతాను. గత వారం రోజుల నుంచి ఇలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నా. ఈసారి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

- ఆశాకుమారి, పాఠశాల ఇన్‌చార్జి టీచర్



సీతాఫల్‌మండి మీ సేవలో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటున్న ప్రజలు



దరఖాస్తులను నింపుతున్న మహిళలు

రేషన్‌కార్డులకు దరఖాస్తుల ప్రక్రియ షురూ

బౌద్ధనగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రక్రియ మొదలైంది. రెండు రోజుల క్రితమే మీసేవలో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినప్పటికి కొన్ని ఇబ్బందుల వలన ఆపివేశారు. దీంతో మీసేవకు వెళ్లిన ప్రజలు, మహిళలు ఆగ్రహం వ్యక్తం చేయటంపై ప్రభుత్వం స్పందించి సోమవారం రాత్రి నుంచి మీసేవలో కొత్త రేషన్‌కార్డులు, పిల్లల పేర్లు యాడ్ చేసుకోవటానికి దరఖాస్తులను తీసుకోవటం ప్రారంభించారు. మంగళవారం ఉదయం సీతాఫల్‌మండి మీసేవకు ప్రజలు వచ్చి దరఖాస్తులు చేసుకున్నారు. మీసేవలో కంప్యూటర్స్ నుంచి ఎటువంటి ఆటంకం రాలేదు. చాలామందికి ఫారమ్‌లు నింపటం రాకపోవటంతో మీసేవ ఉద్యోగులనే దరఖాస్తు ఫారాలు నింపాలని కోరటంతో కొంత గందరగోళం ఏర్పడింది. మంగళవారం దరఖాస్తుల ప్రక్రియ సవ్యంగా సాగింది. మీసేవలో రేషన్‌కార్డు దరఖాస్తు ఫారాలు అందుబాటులో లేకపోవటంతో చాలామంది జిరాక్స్ సెంటర్‌ల్లో ఒక్కొక్క ఫారమ్ పది నుంచి ఇరవై రూపాయలకు కొన్నామని మహిళలు తెలిపారు. ప్రసుత్తం సీతాఫల్‌మండిలో ఐదు కౌంటర్ల ద్వారా రేషన్‌కార్డుల దరఖాస్తులను స్వీకరిస్తున్నామని మీసేవ మేనేజర్ బాలరాజు తెలిపారు. మీసేవ కేంద్రంలో గందరగోళం నెలకొంటుదని పోలీసు భద్రత ఏర్పాటు చేస్తే దరఖాస్తు ప్రక్రియ సవ్యంగా సాగుతుందని ఆయన విజ్ఞప్తి చేశారు.

అక్రమ షెడ్లు కూల్చివేత



అక్రమ షెడ్లను కూల్చివేస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

అడ్డగుట్ట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ అడ్డగుట్టలోని మారేడుపల్లి ఎమ్మార్వో కార్యాలయం ఎదురుగా ఉన్న శాస్త్రీనగర్ బస్తీలో ఫుట్‌పాత్‌లపై వేసిన అక్రమ షెడ్లను జీహెచ్‌ఎంసి సిబ్బంది కూల్చివేశారు. దాదాపు ఇరవై ఏళ్ల క్రితం వేసుకున్న చిన్న చిన్న షెడ్లను కూల్చివేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శాస్త్రీనగర్ బస్తీ ఎదురుగా మారేడుపల్లి రెవెన్యూ కార్యాలయం, ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు రెండు ఉండడంతో పాటు పక్కనే ఢిల్లీ పబ్లిక్ స్కూలు నుంచి వచ్చే ప్రవేట్ స్కూలు బస్సులు, రాకపోకలకు ఈ దారి ఇబ్బందిగా మారిందని స్థానికులు కొందరు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే వారం రోజుల క్రితమే ఈ ప్రాంతా వాసులకు నోటీసులు జారీ చేశామని జీహెచ్‌ఎంసీ అధికారులు తెలిపారు. ఖాళీ చేయమని ముందే హెచ్చరించామన్నారు. రెవెన్యూ కార్యాలయానికి వచ్చే దరఖాస్తు దారులకు వాహనాలు పార్కింగ్ చేసుకునేందుకు ఇబ్బందిగా మారడంతో స్థానికులకు తమ తమ బైకులు పార్కింగ్ చేయడం ఇరుకుగా రోడ్లు ఉండడం వల్ల కొందరు స్థానికులు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేయడం వల్లనే కూల్చివేశారు. తుకారాంగేట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో ఎస్సై కిరణ్ కుమార్‌తో పాటు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు గొడవలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. దాదాపు మూడు గంటల్లో కూల్చివేతలు చేశారు.

నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు.. చిత్రంలో కార్పొరేటర్ హేమలత

పద్మారావునగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధిలోని నేహ్రూనగర్ కమ్యూనిటీ హాలులో మంగళవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రెయిన్‌బో ఫౌండేషన్ ఇండియా, డాక్టర్.బీఆర్ అంబేడ్కర్ రెయిన్‌బో కమ్యూనిటీ కేర్ అండ్ లెర్నింగ్ సెంటర్, జనహిత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో హబ్సిగుడాలోని ఆనంద్ ఐ ఇన్స్టిట్యూట్ సహకారంతో ఏర్పాటు చేసిన శిబిరాన్ని డివిజన్ కార్పొరేటర్ కుర్మ హేమలత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎక్కువ సమయం టీవీ, సెల్‌ఫోన్ చూడటం వల్ల కంటి చూపు దెబ్బ తింటుందన్నారు. సుమారు రెండు వందల మందికి పరీక్షలు నిర్వహించారు. ఆనంద్ ఇనిస్టిట్యూట్ కోఆర్డినేటర్ పూర్ణచంద్, జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధి నర్సింహమూర్తి, నర్సింగరావు, రెయిన్‌బో హోమ్స్ నగర కోఆర్డినేటర్ క్రాంతి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి

- ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి



సమావేశంలో పాల్గొన్న తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి, మాధవి తదితరులు

తార్నాక, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల డిమాండ్ల సాధనకై మంగళవారం తార్నాకలో తెలంగాణ ఉద్యమకారుల మహిళా వేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మహిళా ఉద్యమకారుల వేదిక అధ్యక్షురాలు కె. మాధవి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మహిళా ఉద్యమకారులను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, దాంతో ఉద్యమకారులు ఆర్థికంగా పూర్తిగా చితకిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఇప్పుడైన కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయడంతో పాటు, 250 గజాల ఇంటి స్థలం, నెలకు రూ. 30 వేల పెన్షన్, రూ. 20 లక్షల ఇన్సూరెన్స్‌ను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యమకారుల మహిళా వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుల ధనలక్ష్మి, కోశాధికారి ధార వెంకట లక్ష్మి, అధికార ప్రతినిధి ఉల్లంగి పద్మ, కల్లూల పార్వతమ్మ, తుమ్మల ప్రఫూల్ రాంరెడ్డి, చందనా ప్రసాద్, పెద్ద యాదగిరి, డోలక్ యాదగిరి, రాజేంద్ర ప్రసాద్, బైరాగి మోహన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ కోదండరామ్

విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించాలి

రెజిమెంటల్‌బజార్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ర్యాంకులు ముఖ్యం కాదని ఆత్మస్థైర్యంతలో జీవించేలా తీర్చిదిద్దాలని ఎమ్మెల్సీ కోదండ రామ్ అన్నారు. మంగళవారం రెజిమెంటల్‌బజార్ హిల్ స్ట్రీట్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన ఐఎఫ్‌పీ ఉపాధ్యాయ శిక్షణ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పేద విద్యార్థులకు విద్యా అందాలంటే ప్రభుత్వ బడులు ఉండాలని అన్నారు. సాంకేతిక విద్య అందిస్తు విద్యార్థులను ప్రొత్సహించాలని, ప్రభుత్వం విద్యా వ్యవస్థకు తీసుకునే నిర్ణయాలు, వసతులు, సౌకర్యాలు అందరికి తెలియజేయాలని అన్నారు.

కార్యక్రమంలో సికింద్రాబాద్ డిప్యూటీ ఈఓ శ్రీధర్, వివిధ ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అల్లాడిరాజ్‌కుమార్ నగర్‌లో కార్పొరేటర్ పర్యటన



అల్లాడిరాజ్‌కుమార్‌నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ తదితరులు

బౌద్ధనగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్ డివిజన్ అల్లాడిరాజ్‌కుమార్‌నగర్‌లో మంగళవారం కార్పొరేటర్ కందిశైలజ అధికారులతో కలిసి పర్యటించారు. ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బస్తీలో పేరుకుపోయిన చెత్తకుప్పలను పరిశీలించారు. చెత్తకుప్పలను తొలగించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డీఈఈ తిరుపతి, ఏఈ లావణ్య తదితరులు పాల్గొన్నారు.



సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో జరుగుతున్న కోటి కుంకుమార్చన పూజలో రాంగోపాల్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ చీర సుచిత్రశ్రీకాంత్ దంపతులు పాల్గొన్నారు. ఉజ్జయినీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. - సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి అదృశ్యం



నర్సింగ్‌యాదవ్

బౌద్ధనగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వాకింగ్‌కు వెళ్తతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై జ్ఞానేశ్వర తెలిపిన వివరాల ప్రకారం... మెట్టుగూడకు చెందిన బి.నర్సింగ్‌యాదవ్(42) మద్యానికి బానిసయ్యాడు. మద్యం మానిపించటానికి కుటుంబ సభ్యులు నర్సింగ్‌యాదవ్‌ను రెండు సంవత్సరాల క్రితం నగరంలో ఓ రిహాబిలిటేషన్ సెంటర్‌లో వైద్యం చేయిస్తున్నారు. ఇటీవల ఇంటికి అతను వచ్చాడు. ఈనెల 9వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు వాకింగ్‌కు వెళ్తతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. అతనికోసం పలుచోట్ల గాలించిన ఫలితం లేదు. దీంతో తండ్రి యాదగిరి యాదవ్ సోమవారం రాత్రి చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సుభాష్‌నగర్‌లో యువతి..



నేహ (ఫైల్)

రాంగోపాల్‌పేట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగానికి వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన మహంకాళి పోలీస్‌స్టేషన్ పిరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ పరశురామ్ తెలిపిన వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్‌లో నివసించే భత్తినేవర్ నేహ(19) ప్యాట్నీ సెంటర్‌లోని చెన్నయ్ షాపింగ్ మాల్‌లో సేల్స్ గర్ల్‌గా పనిచేస్తుంది. సోమవారం యథావిధిగా ఉద్యోగ నిమిత్తం చెన్నయ్ షాపింగ్ మాల్‌కు ఇంటి నుంచి వచ్చింది. సాయంత్రం వరకు పని చేసిన నేహ సాయంత్రం తరువాత తాను పనిచేసే చోట కనిపించలేదు. దీనితో షాపింగ్ మాల్ మేనేజ్‌మెంట్ నేహ తల్లి భత్తినేవర్ గంగమ్మకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. దీనితో గంగమ్మ తెలిసినవారికి ఫోన్ చేసి నేహ గురించి విచారించింది. ఆచూకీ తెలియక పోయేసరికి మహంకాళి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు అందుకున్న పోలీసులు మిస్సింగ్ కేసు కింద నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎవరైన ఆ యువతిని చూసినా లేక ఆచూకీ తెలిసిన వెంటనే మహంకాళి ఇన్‌స్పెక్టర్ పరశురామ్ (8712660240)కు గాని, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ పరదేశీ జాన్ (8712660234)కు గాని పోలీస్‌స్టేషన్ (8712661253)కు గానీ లేక నేరుగా పోలీస్‌స్టేషన్‌లో కానీ సమచారం ఇవ్వాలని కోరారు.

తుకారాంగేట్‌లో మహిళ...



సోనీ

అడ్డగుట్ట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మీ సేవకు వెళ్లిన ఓ గృహిణి అదృశ్యమైన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. తుకారాంగేట్ వెంకట్‌నగర్‌కు చెందిన సోనీ (25) తుకారాంగేట్‌లోని ఓ ప్రవేట్ పాఠశాలలో ఆయాగా పనిచేస్తుంది. సోమవారం మీసేవకు వెళుతున్నాని చెప్పి బయటికి వెళ్లింది. తిరిగి ఆరోజు రాత్రి వరకు ఇంటికి రాకపోవంతో భర్త జాడి మహేష్ బంధువులు స్నేహితుల ఇళ్లలో వాకబు చేశాడు. గత్యంతరం లేకపోవండంతో భర్త అదే రోజు తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.